# బియ్యం

రాజులమ్మ మొగుడు ఆరోజురిక్షా వెయ్యలేదు.

"గండడు పుల్లుగ తాగీసొచ్చి, నానా ఖంగాళీ చేయిస్సి, ఇన్ని గల్లు గంజినీళ్ళు తాగి తొంగుండిపోయాడు-"

రాజులమ్మ ఎలిమెంటరీస్కూలు మేస్టారింట్లోనూ, వీడీవో గారింట్లోనూ పనిచేస్తున్నది. ఉడుపులకీ, గొప్పులకీ, కోతలకీ - ఇంకా చిన్నా పెద్దా పొలం పన్లన్నిటికీ వెళ్తుంది. ఏ కవుకులు పడయినా యిల్లు గడపాలి గదా, దినం ఎళ్లాలి గదా - అందుకోసం రెక్కలు ముక్కలు చేసుకుంటున్నది. ఇంతోటి సంసారానికీ నలుగురు పిల్లలు - ముగ్గురాడగుంటలూ, కడసారం మొగ్గుంటడు.

"ఇక శేన - ఆపరేశన్ సేయించుకోరా -" అనెందరు చెప్పినా రాజారావు ఆలకించేడుగాడు నలుగుర్ని పుట్టించేడు. అప్పడయినా అప్పలకొండ లాక్కెళితే వెళ్లి - ఆపరేషన్ చేయించుకుని, వాళ్ళ వాళ్లవాటాలు డాక్టర్లు , నర్సులు మినహాయించుకోగా ఇచ్చిన డబ్బుల్తో ఇద్దరూ కలిసి పుల్లుగా తాగేసి వొచ్చారు. ఆ రాత్రి వాడినిక్కరు జేబులో కొత్త పదిరూపాయల నోటు దొరికింది, డబ్బులకోసం తడిమితే. "దంచినమ్మకి బొక్కిందే దక్కుడ"ని ఆ నోటు తీసి దాచింది రాజులమ్మ. ఆ మర్నాడు ఆడబ్బుల్తోనే కేజీన్నర బియ్యం కొన్నాది. ఆ రోజుకి లోటులేకుండా ఇంత కూడు తిన్నారు.

మొదటి పిల్లపేరు సరస్వతి. అది నిజంగా చదువుల సరస్వతే. వాళ్ల తాత దానికే పేరు పెట్టినందుకు - పేరు నిలబెట్టింది. నాలుగో క్లాసు చదువుతున్నది. ఆ గుంట చదవనూ చదువుతుంది తల్లికి సాయం చెయ్యనూ చేస్తుంది. బుద్ధిమంతురాలు. కాకపోతే రేగతోటకూరలా రెపరెపలాడుతూ ఎదిగిపోతున్నదని దాన్ని చూస్తుంటే తల్లి కెందుకో భయం.

రెండో గుంట నరసమ్మ, అది చెడ్డది కాకపోవచ్చునుగాని 'మా కాని గుంట'. ఎప్పుడూ ఏడుపూ, ప్రతిదానికీ పేచీ, బడికి వెళ్లడం అంటే దానికి గండం. తిన్నగా వెళ్లదు.

మూడో పిల్లకి మూడేళ్లు నిండిపోయి - నాలుగోయేడు జొరబడ్డాది - ముత్యాలు. కడిగిన ముత్యంలా కళ కళలాడుతూ వుంటుంది. కలిగున్న వాళ్లయింట్లో పుట్టివుంటే కాన్వెంటుకు వెళ్లవలసిన వయసు.

ముగ్గుర్నీ బడికి తోలేస్తుంది రాజులమ్మ. కాని - రెండోదీ, మూడోదీ తిన్నగా బడికి వెళ్లరు. పొయ్యిలోకి పుల్లా పుడకా కంపా ఏరుకొస్తారు.

కడసారం మొగబొట్టిడు. వాడికి సంవత్సరంన్నర. వేణు అని పేరు పెట్టారు పనిమనిషి కొడుక్కి అంతమంచి పేరున్నందుకు హెడ్‌మేస్టారు ఆశ్చర్యపడ్డారు. బతుకులు మంచిగా జరగని వాళ్లకి మంచి పేర్లుండటం అపదే. కాని కాలం మారింది ఆ మార్పు - మంచి పేర్లేవరకూ వచ్చి ఆగిపోయినట్టుంది.

"సరస్సోతీ - బేగి బేగెల్లు - యియ్యాల బియ్యాలిస్తారట. మేష్టగారు సెప్పినారు. నరసనికూడా కూడా తీసుకుపో. సంచొట్టుకెల్డం మర్చిపోకుమీ -" అని మరిమరీ చెప్పి, వీడీవో గారింటికీ పనికి బయల్దేరింది, వేణుగాణ్ణి చంకవేసుకొని.

సరస్వతికి తొమ్మిదేళ్లు నిండాయి. ఇంటికి ఆ పిల్లే పెద్దది. తన చిన్న చేతుల్తో అన్ని పన్లూ కుదురుగా చేస్తుంది. యింటికి తాళం వేసి, తాళం చూరులో పెట్టింది. "రా(రా" అని యిద్దరు చెల్లెళ్లనీ తీసుకుని బయల్దేరింది బడికి పలకలూ పుస్తకాలూ పట్టుకుని బయల్దేరారు. సరస్వతి పుస్తకం నలగలేదు. నరస పుస్తకం చింకిచేటలా వుంది. పలక అంచులు పగిలిపోయేయి.

రెండు పెద్ద పెద్ద గదులు. పైన ఏస్బెస్టాస్ రేకు. ముందుకు పదడుగుల పొడవైన వరండా. వరండా మధ్యలో రెండు స్తంభాలు. ఆ స్తంభాల మధ్య పొడవుగా వెడల్లయిన మూడు మెట్లు. అదే పాఠశాల 'భవనము'. ఆ భవనానికి ఆ జిల్లాకి ఒక కేంద్రమంత్రి శంకుస్థాపన చెయ్యగా, ఆరునెలలు మాత్రమే విద్యామంత్రిగా పనిచేసిన మరొకాయన ప్రారంభోత్సవం. ఆ భవనానికి సమీపంలో ఒక చిన్న నీళ్లటాంకు. వరసగా మూడు కొళాయిలు. 'గ్రామీణ రక్షిత మంచినీటి పథకము కింద దాన్ని జిల్లా పరిషత్తు వారు నిర్మించారు. రోడ్డుదాటి స్కూలు గ్రౌండు (?) లోకి వెళ్లేదారిపక్క...... సమితి ప్రాథమిక పాఠశాల, కోకిల మెట్ట లక్ష్మీపురం - అని వెలవెలలాడుతున్న రేకు బోర్డుంది. స్కూలు వెనకపక్క పెద్ద పెద్ద రాళ్ల గుట్ట లున్నాయి. ఆ పక్కనున్నవన్నీ రాళ్లక్వారీలే. ఆ చుట్టుపక్కల గ్రామాల వాళ్లంతా రాళ్లు కొట్టుకుని బ్రతుకుతుంటారు. ఆ వూరు కెంటూన్మెంట్ నానుకుని వుంటుంది. అది విజయనగరంలో ఒకభాగం. కెంటూన్మెంట్ పక్క రైల్వేస్టేషనుంది.

ఆ స్కూల్లో నూట యాభయి మంది పేర్లున్నాయి. హెడ్మేస్టారు కాక మరొక ఇద్దరు టీచర్లున్నారు. హెడ్మాస్టారు ఆ వూళ్లోనే వుంటున్నాడు. ఒక మేష్టారు రామవరం నుంచి సైకిలు మీద వస్తాడు. మరొక టీచరమ్మ రిక్షామీద - విజయనగరంలో కొత్తగ్రహారం నుంచి వస్తుంటుంది.

గణగణ బెల్లుమోగింది. పిల్లలంతా స్కూలుముందు చెట్టుకిందకి చేరారు. జనం బాగా కిట కిట లాడుతున్నారు. బియ్యం ఇస్తారని అందరికీ తెలిసిపోయింది. రిజిష్టరులో పేరులేని పిల్లలు కూడా కొందరు చేరారు. రిజష్టరులో నూటయాభైమంది పిల్లల పేర్లన్నా, అట్టెండన్సు మాత్రం నికరంగా నూరు. ఇవ్వాళ పేరులేని నలుగురయిదుగురు గుంటల్తో పాటు సుమారు నూట పాతిక మంది హాజరయ్యారు.

పూర్వం అమెరికా 'కేర్' సంస్థనుంచి గోదుమనూక, నూనె వచ్చేది. ఉప్మా వండించి పిల్లలకి పెట్టేవారు. రోజూ వంట, ఊరిపిల్లలంతా కంచాలూ గిన్నెలూ పట్టుకుని వచ్చీడం - నానా సంతగోలగానూ వుండేది. క్రమంగా ఆ "మధ్యాహ్న భోజన పథకం" పోయింది. ఈ మధ్య కనీసం 75 శాతం అట్టెండెన్సున్న పిల్లలకి బియ్యం పంపిణీ పథకం వచ్చింది. ఆ నాటి గోధుమనూక, నూనె డబ్బాల్లోనూ కొన్ని సమితి అధికార, అనధికార్లకు వెళ్లేవి. ఇప్పటి బియ్యమూ అంతే. పథకాలు పేదలవి. ప్రాప్తి కలవారికీ, అందుకే రకరకాల పథకాలు అవి న్యాయసమ్మతమైనవాకాదా అవకతవకలున్నాయా అన్న చర్చ అలా వుంచితే అవి సక్రమంగా పేదలకు అందడం లేదు.

"సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం వందే మాతరం -"

పిల్లలు కోరస్‌గా ప్రార్థన చేశారు. పిల్లలెదురుగా హెడ్ మేస్టారు వెనక - పిల్లల్ని సరిగ్గా వున్నారో చూసేందుకు టీచర్‌గారు కాపలా వున్నారు. రామవరం మేస్టారింకా సైకిలు దిగలేదు.

తరవాత - ప్రతిజ్ఞ. పిల్లలందరి దగ్గరా సంచులున్నాయి. ఒకరిద్దరు గిన్నెలు తెచ్చుకున్నారు.

"భారతీయులందరు నా సహోదరులు. నేను నా దేశమును ప్రేమించుచున్నాను నా దేశముపట్లను, నా ప్రజలపట్లను సేవానిరతి కలిగియుందునని ప్రతిజ్ఞ చేయుచున్నాను.-"

ప్రధాన మంత్రి మొదలు ప్రాథమిక పాఠశాల పిల్లల వరకూ అందరూ ప్రతిజ్ఞ చేసేవాళ్లే - కోట్లాది ప్రజాధనం విదేశాలకి తరలిపోతున్నది. మరికొన్ని వందలకోట్లు నాయకులే స్వాహా చేస్తున్నారు, గూండాలూ, హంతకులూ, లంచగొండులూ, స్వార్థపరులూ, మతోన్మాదులూ - ప్రభుత్వం చేస్తున్నారు. ప్రజలు తిండికి మొహం వాచిపోతున్నారు. హెడ్ మేస్టారు ఒకసారి చుట్టూ తిరిగి పిల్లల్నందర్నీ హెచ్చరికగా చూసి" జై - హింద్ - " చెప్పించారు.

పిల్లలు బిల బిల లాడుతూ బిల్డింగ్‌లోకి వెళ్లారు. అన్ని క్లాసులలోనూ కిటకిటలాడుతున్నారు. ఒకటవతరగతి పిల్లలు ముందున్న అరుగు (వరండా) మీదకూచున్నారు. అందరి మొహాలూ కళ కళలాడిపోతున్నాయి.

ప్రజల ప్రాథమికావసరం - ఆ అ లు నేర్పే చదువులు కాదు. తినడానికి కడుపుకింత అన్నం. అన్నం తరవాతే అఆలూ ఇఈలూను. పాతికేళ్లుగా ఈ విద్యావిధానాన్ని హెడ్‌మేస్టారు చూస్తూనే వున్నారు. జీతాలు పెరిగాయిగాని, పేదప్రజల పరిస్థితులు మారలేదు. ఇవ్వాళ సందుకొకటీ, గొందుకొకటీ కాన్వెంట్లొచ్చాయి. విద్య వ్యాపారం స్థాయిని కూడా దాటిపోయి జూదం స్థాయికి దిగిపోయింది. అతనికొడుకు టౌన్లో పాలిటెక్నిక్ కోచింగ్‌కు వెళ్తున్నాడు. కూతురు కెంటూన్మెంట్‌లో ప్రయివేటు స్కూలుకు వెళ్తుంది.

రామవరం మేస్టారు సైకిలు దిగేరు.

అన్ని క్లాసులకీ అటెండెన్సు వెయ్యడం ముగిసింది. ఒకడు కిరసనాయిలు డబ్బా బాగాకడిగేసి తెచ్చుకున్నాడు." నాకూ మాతమ్ముడికీ బియ్యం ఈ డబ్బాలో పోసేండి "అన్నాడు వాడు.

" అటెండెన్సు పూర్తిగా వున్నవాళ్లకే బియ్యం - " అని మళ్లీ మళ్లీ ప్రకటన చేశారు హెడ్‌మేస్టారు.

" ఈడు సమంగ బడికి రాడండి- " అన్నాడొకడు"

" ఆళ్లమ్మ సచ్చిపోయిందండి - మరందుకని - " అని గొణిగాడు ఆ పక్కనున్న వాడు. కొందరి ముఖాల్లో బెదురు వ్యాపించింది. అంతా గోలగోలగా వుంది.

" సైలెన్స్ - సైలెన్స్ - గొల్లు పెట్టకండిరా " అని గట్టిగా అరిచేరు రామవరం మేస్టారు. ఆయన నాలుగో క్లాసుకు చెబుతారు.

" అన్నం తిన్న తరవాత కదండి అ ఆ లు దిద్దుకోడం! కడుపులో తిండి పడందే సదువు సెప్పినా బుర్ర కెక్కదు. మరంచేత బియ్యం వేగం ఇచ్చేండి " అన్నాడొక గ్రామస్తుడు. కిరసనాయిలు డబ్బా తెచ్చుకొన్న పిల్లల తండ్రి ఆ ఆసామీ.

బియ్యం పంపకం కార్యక్రమం ఒకటో తరగతినుంచీ ప్రారంభమైంది. చిన్న పిల్లలు గదా ముందు పంపించడం మంచిదని అలా చేస్తున్నారు. ఆడవాళ్ళొక ముగ్గురు నలుగురొచ్చారు. తమ పిల్లలు చిన్నవాళ్ళు గనక వాళ్లని జాగ్రత్తగా తీసుకు వెళ్లడానికి. ఆయా బియ్యం కొలుస్తుంది ఆయా అంటే - స్వీపరు, వాటర్ వుమన్ - అన్నీను.

రామవరం నుంచి వచ్చే మేస్టారికి కణపాకలో రెండెకరాల మెట్టవుంది. అందులో ఇవ్వాళ శనక్కాయలు తవ్వుతున్నారు. సెలవుపెట్టాలనుకున్నాడుగాని - " బియ్యాలిస్తాం. ఈ ఒక్కరోజు సెలవుపెట్టొద్దు. గుంటల రద్దీ కాయలేం. ఎవళ క్లాసులు వాళ్లు చూసుకుంటే మంచిది" అనేశాడు హెడ్‌మేస్టారు. గోలన్న గోలకాదు, చెవులు చిల్లులు పడి పోతున్నాయి. రామవరం మేస్టారు మధ్య మధ్యలో ఓక్కొక్క వరుస బాదు తున్నారు. టీచరమ్మ చిన్న బెత్తం పుచ్చుకొని అదిలిస్తున్నది గాని కొట్టడంలేదు. ఆవిడెందుకో గాని పిల్లలు ఏడుస్తుంటే భరించలేదు.

హెడ్ మేస్టారు అన్ని తరగతుల అటెండెన్సు రిజిస్టర్లు దగ్గర పెట్టుకుని టిక్కులు పెట్టుకుంటున్నారు. ఏం టిక్కులు - ఏం లెక్కలు - స్కూలుకు రావలసిన నాలుగుబస్తాల్లోనూ ఒక అరబస్తా ఆఫీసులోనే వుండిపోతుంది. మండల ప్రెసిడెంటు నుంచి, విద్యా విస్తరణాధికారిగారికి,మండల డెవలప్‌మెంట్ ఆఫీసర్ వారికి, గుమస్తాకి, బంట్రోతుకీ ఎంతోకొంత చొప్పున పంపకం జరిగి పోతాయి. హెడ్ మేస్టారు అందరికీ అన్నీ జాగ్రత్తగా పంచేశాక ఎలాగో కొంత మిగిల్చి, తానొక ఐదు కేజీలూ, ఇద్దరు అసిస్టెంట్లకీ చెరి మూడు కేజీలూ ఈచ్చేస్తాడు. గ్రామ ప్రెసిడెంటూ, వీడీఓలు కూడా రాభోయేరుగాని - పారికొక " గిరీశం టైపు" లెక్చరిచ్చేసరికి - ఇక మరి ఆ దరిదాపులకి రాలేదు. ఒక్కనెలమాత్రం ప్రెసిడెంటుగారింటికి పదికేజిలు పంపేడు. ఆ తరవాత ఎంచేతనో అతగాడు అడగలేదు. అతడికి మదెకరాల పల్లం, మూరెకరాల మెట్ట, ఎకరంన్నర మామిడితోటా వున్నాయి. గతసారి మండల వైస్ ప్రెసిడెంటుగా కూడా చేశాడు. " పేదపిల్లలకు బియ్యం పంపిణీ పథకం" ఆ నెలకి - మధ్యాహ్నం ఒంటిగంట న్నరకి ముగిసింది. హెడ్‌మేస్టారు భోజనానెకి వెళ్లేరు. మిగతా ఇద్దరూ యిళ్లథగ్గిర్నించి తెచ్చుకున్న భోజనం తింటున్నారు. బియ్యం ఇచ్చినరోజు మధ్యాహ్నం పిల్లలు అంతగా రారు.

సరస్వతివి మూడూ,నరసమ్మవి మూడూ - మొత్తం ఆరుకేజీల బియ్యం. బియ్యం సంచీ బరువుగా చంక కెత్తుకుంది. నరసమ్మ ఇద్దరి పలకలూ, పుస్తకాలూ పట్టుకుంది. ముత్యాలు చింపిరి జుట్టుతో చిరిగిన గౌనుతో వాళ్ళ వెంటనడుస్తున్నది.

అక్టోబర్ నెలమూడోవారం సాయింత్రాలప్పుడు చలిప్రారంభమైనా ఎండలు గట్టిగానే వున్నాయి. ఆ వూళ్లో కరణం గారుండేవీధి కాస్త విశాలంగా శుభ్రంగా వుంటుంది. ఆ వీధులన్నీ దాటుకొని, ఆఖర్న కుమ్మరి వీధి దాటుకొని వెళ్లాలి. సరిగ్గా కరణంగారింటి దగ్గిరకొచ్చేసరికి మూడుకుక్కలు దెబ్బలాడుకుంటున్నాయి. ఒక కుక్క నల్లమచ్చల్తో బక్కగా డొక్కులాగ వుంది. కాని పౌరుషం చెప్పలేం. పెద్దపందిలాంటి కుక్క మీదికి కలబడుతోంది. సరస్వతికి భయం వేసింది. ముత్యాలు బెదిరిపోయి కరణంగారింటి ఎత్తరుగులవారకి నక్కేసింది. నల్లకుక్క పెద్దకుక్కని తరుముతూ సరస్వతికాళ్లల్లోంచి

పరుగుతీసింది. మూడోకుక్క భౌభౌమని గగ్గోలు పెట్టేస్తుంది. ఆ అరుపులకి ముగ్గురాడగుంటలూ బెదిరిపోయారు.

సరస్వతికి నల్లకుక్క కాళ్లలో పడేసరికి, దభేలున పడిపోయింది.

"ఓలమ్మో - బేపులు బేపులర్రా - అమ్మో -" అని పెద్దగొంతుతో ఏడుపులంకించుకుంది. నరసమ్మ ఇందాకే ఏడుపు ప్రారంభించింది. ముత్యాలు అరుగెక్కేసి భయంభయంగా స్తంభం చాటునుంచి చూస్తున్నది.

మధ్యాహ్నం ఒంటిగంటన్నరసమయం. వీధిలో జనం లేరు. బియ్యం మొత్తం ఒలికి పోయాయి. నరసు గుంట పరుగు పరుగున ఇంటికి వెళ్లింది తల్లిని తీసుకురావడానికి. కుక్క లెక్కడ వెంట పడతాయోనని స్పీడ్గా, బ్రేకుల్లేని సైకిల్లాగ దూసుకు వెళ్లింది. పలకా, పుస్తకాలూ రోడ్డు మీద పడిపోయేయి. సరస్వతీ, ముత్యాలూ ఇసకలో ఒలికిపోయిన బియ్యం ఎత్తుతున్నారు. అక్కని చూసి ముత్యాలు ఏడుపు ప్రారంభించేసింది.

దోవంట పోయే జనం చేరి - కుక్కల్ని తరిమి, పిల్లలకి - " భయ్యం లేదు. భయ్యం లేదు. ఏడకండేడకండ" ని ధైర్యం చెప్పారు.

పెద్దగా కేకలు వేస్తూ తిట్టుకుంటూ పరుగు పరుగున వచ్చింది రాజులమ్మ. వస్తూనే సరస్వతిని నాలుగు చరిచి గబగబా బియ్యం ఎత్తడం ప్రారంభించింది. బియ్యం నిండా ఇసకరాళ్లూ, మన్నూను.

"బేపిని కొట్లేవా - పెద్ద గుర్రం నాగున్నావు" అని కూతుర్ని మరోటి కొట్టింది, "కొట్టక కొట్టక - శాన పల్లకో" అని ఒక నాయురాలు. రాజులమ్మని వారించింది. ఒక చేత్తో ముత్యాల్ని ఈడ్చుకుంటూ, మరో చేత్తో బియ్యం సంచిపట్టుకుని యింటికొచ్చింది రాజులమ్మ.

ఎంత తీసినా కొంతబియ్యం పోనేపోయింది. రాలేదు తియ్యడానికి. సన్నటి మన్నూ చిన్న చిన్న తెల్లరాళ్లూ ఇసకాను. నిక్షేపం లాంటి బియ్యం. మూడు నాలుగు రోజులుకి సరిపోయే బియ్యం. ప్రాణం ఉసూరుమనివెంచింది.

తను ఇన్ని మెతుకులు గబ గబా తిని, పిల్లలకింత పెట్టి, అదేపనిగా కూచుని చెరగడం ప్రారంభించింది బియ్యం. మరొక చేటలో పోసుకుని సరస్వతి - చేతికందిన రాళ్లూ, బెడ్డలూ ఏరుతున్నది. దానికి ఏం జరిగిందీ తెలుసును. తండ్రి తాగేసి వచ్చి అల్లరిచెయ్యడం తప్ప సరిగ్గ డబ్బులివ్వడాని తెలుసు. తిండికి లేక ఒకోరోజు తల్లి పస్తుతొంగుంటుందని ఆ పిల్లకి తెలుసు. బియ్యం బాగు చెయ్యడంలో తల్లికి సాయం చేస్తున్నది. వేణు నిద్రపోతున్నాడు. మిగత ఇద్దరాడ గుంటలూ ఇంటిముందు చింతచెట్టుకింద చింత పిక్కలాలాడుకుంటున్నారు.

అక్షరాలకి వాళ్ల జీవితంలో స్థానం తక్కువ. విద్యా విధానాలూ, విద్యా ప్రణాళికలూ - వాళ్లకి పట్టవు. రెక్కాడితేగాని డొక్కాడని వాళ్లకి చదువుకుంటూ కూర్చుంటే దినం ఎలా గడుస్తుంది ? చదవంటే - కొంత జరుగుబాటూ, కొంత తీరుబడీ వుండాలి. జనాభాలో సగానికి పైగా జనం రెక్కలు ముక్కలు చేసుకోక పోతే, మరికొంతమంది చిన్న చిన్న ఉద్యోగాలు చేసి బతకకపోతే - దేశం ఎలా నడుస్తుంది?

అభివృద్ధి అవుతుంది ? ఈ సమస్యలకి - నిరక్షరాస్యతా నిర్మూలన పరిష్కారమా ? నిరుద్యోగం, జనాభా సమస్య, అన్నిట్నీ మించి కార్మిక కర్షక, శ్రామికుల దోపిడీ !! అక్షరం ముక్కరాని కష్టజీవులు లేకపోతే, మోటు మనుషులు లేకపోతే - ఈ దేశం ఎక్కడికి వెళ్తుంది ?.

పొద్దు వాలింది. రాజులమ్మకి నడుం పీక్కుపోయింది. ఎంత లేదన్నా ఒక అరకేజీ బియ్యం పోయి వుంటుంది. గిన్నెలో నీరు పోసి, బాగా గాలించింది. తడి బియ్యం, ఆరబోసి, తిరగలిలో విసురుకుంటే బియ్యపు నూక తయారవుతుంది. ఉప్పుడు పిండి (ఉప్మాకాదు) తయారు చేసుకోవచ్చు. కడుపు మంటకి ఏదో కొంత ఆధారం.

"పోనీ మరేటిశేస్తాం - దక్కిన కాడికే శాన" అనుకుంది.

"పాపం - బేపి మీదపడితే ఆ గుంట మాత్రం యేటి సేస్తాది-" అని సమాధానం పడింది.

రేపు "బాబూ - ఎడ్ మేస్ట్రు బాబూ ఇలగ జరిగింది. కసిన్ని బియ్యం ఎట్టవా -" అనడిగి తెచ్చుకోవాలనుకుంది. కానతడివ్వక పోవచ్చు. పోనీ అమ్మగార్నయినడగాల - అనుకుంది.

రాజారావు ఆ మధ్యాహ్నం తిండికి రాలేదు. ఏదో బేరం తగిలివుందిపోయి వుంటాడు.

పర్వతిని పిలిచి -" గిన్నెలోనన్నం వుండిపోనాది. మీ యయ్య రాలేదు. తాగీసి ఎక్కడ తొంగుంది పోనాడో - నువ్వెల్లి ఆయన్నం కలిపి - నువ్వింతతిని మిగిల్నిది పిల్లలికి పెట్టుమీ -" అన్నది ఆపేక్షగా. అని మంచినీరు తేవడానికి రామకోలిల పక్క మంచినీటినూతికి బయల్దేరింది, ఇత్తడి బిందె పుచ్చుకుని.

దీపాలు పెట్టే వేళయింది. రాజారావింకా ఇల్లు చేరలేదు.

అసోకా హోలుకాడ - దాని పాత పేరు అసోకా హోలే ఇప్పుడే వెంకటేశ్వరా అయింది - చిన్న ఒటేలుంది. అక్కడ ఐదు రూపాయలుచ్చుకుని ఇంతన్నం, కూరపిసరూ, చారూ ఇస్తారు. ఒక మాదిరిగా సరిపోతుంది. ఫరవాలేదు పూటగడవుకోడానికది శాన. బేరం తగిలితే ఒకోసారక్కడే తినేస్తుంటాడు.

సాయంత్రానికి ఆ బియ్యమే వండింది. నాలుగువంకాయలూ, నాలుగు నెత్తళ్లూ కలిపి, బాగా ఇన్ని వుల్లి పాయ ముక్కలు కోసి దాకనిండా కూరొండింది. ఎంత బాగుచేసినా సన్నటి ఇసక పంటి కిందికి అక్కడక్కడ తగుల్తూనే వుంది. రాజులమ్మకి మనసంతా మాచెడ్డ వెల్తిగా వుంది. ఏం చెయ్యగలదు?

రాజారావు దీపాలు పెట్టేసరికి రిక్షా చెట్టుకితోసి దిగేడు. బందులు ఊడిపోయిన తలుపులాగ ఊగిపోతున్నాడు. చుక్క వేసుకునేవచ్చాడు. మధ్యాహ్నం తిన్న హోటేలు మెతుకులు ఏమూలకి ? కడుపులో నకనకలాడు తున్నది "ఒత్రాజులూ - వొడ్డించే వొణ్ణం -" అంటూ విసురుగా లోపలికొచ్చి విరిగిపోయిన పీటవేసుకుని కూచుండి పోయాడు.

"అలగే కూకుండి పోనావేటి ? కంపు కొడతంది. ఆ కమీజు ఇప్పేసి కాళ్లూ సేతులూ కడుకుని రా-" అని గసిరింది.

కమీజు విస్సురుగా విప్పి తలుపుమీద పడేసి, ఇన్ని నీళ్లు కాళ్ల మీద పోసుకుని, బుక్కెడు నీళ్లు నోట్లోవేసి పుక్కిలించుకుని వచ్చికూచున్నాడు. జుట్టంతా చింపిరి చింపిరిగా వుంది. వొళ్లంతా చమట

చమటగా వుంది. కళ్ళు ఎర్రెర్రగా వున్నాయి. రాజారావుకి కోపంకోపంగా చిరాకుచిరాగ్గావుంది. ఒక ఉల్లిపాయ ఒలిచి రెండుముక్కలు కోసి పక్కన పెట్టింది రాజులమ్మ. ఆ వురావురుమంటూ ఒక ముద్దఎత్తి నోట్లో పెట్టుకున్నాడో లేదో - ఛి -ని-య్యమ్మ..." అని బయలు లంకించుకున్నాడు.

"ఏటే ఈ వొంట. బియ్యం బాగుసెయ్యనేదా - రాళ్లూ బెడ్లూ ఏర్నేదా - లంజికనా నీ..."

జరిగిందంతా చెబుదామనుకుంది. చెప్పలేదు. చెప్పినా వినడు. తాగకుండా మామూలుగా వున్నప్పుడుకూడా వినకుండు. మరెందుఉదకుని - తట్లన్ని ఆలకిస్తూ పల్లకుండిపోయింది.

గబగబా రెండు ముద్దలు నోట్లో పెట్టుకుని, పంటికింద రాయితగిలి "అమ్మా-" అన్నాడు బాధగా. కంచం దగ్గిర్నించి వేచి, ఎంగిలి చేత్తోనో రాజులమ్మ దవడ పగలేశాడు. ఆకలి మీదున్నాడు గాక, మిగిలిన అన్నంతో ఇన్ని గంజినీళ్లూ ఉప్పు కలుపుకుని కంచం ఎత్తిపట్టి తాగేసి - మీసాలు ఒత్తుకుంటూ లేచాడు. దండెం మీద బనీను తీసి తొడుక్కుని అలాగే నులకమంచంమీద తిరగబడిపోయేడు. తెల్లారే వరకూ మరి లేవడని రాజులమ్మకి తెలుసు. తెల్లటి కొవ్వురాళ్లుండిపోయేయి. గాలించినా ఆడికి తెల్దు. నాదారి బతుకులకి బియ్యంవుంతే శాన. చింత చిగురు, చింతకాయలు, మామిడికాయలు, ఉప్పుచేప - ఏమీలేకపోతే ఇంతగంజి, ఉప్పుగల్లూ వుంటే శాన. దిక్కుమాలిన బతుకులకి రాళ్లులేని బియ్యంకూడా ఒక కలే. చెప్పుకుంటే సిగ్గు - ఒకోసారి ఆబియ్యపు గింజలూ వుండవు - నూకలు జావకాసి పిల్లలకి పోసి, కాసింత గంజితాగి కడుపులో కాళ్లు పెట్టుకు తొంగుంటాది. "మొగుడు గొల్లిగాడు ఏటీ పట్టించుకోడు"

రాజులమ్మకి మనుసు నొప్పి తోచింది. కళ్లలో నీర్లుతిరిగేయి. గుంటలకి చదువు అబ్బే మాటనిజమే గాని - బియ్యం ఇవ్వకపోతే మట్టుకు బడికీ పంపదు. ఆ ఆ లొస్తే ఆకలి తీరదుకదా! ఏ రైతుకాడో పనికి కుదిరిస్తే - ఇన్ని గింజలయినా కొలుస్తాడు. దివం గడవని పేదోళ్లకి చదువుకుంట కూకుంటే కూడెవడు పెడతాడూ ? దేవుడా రాముడా అంటే - రాముడు పెడతాడా ? బాబూ నాయినా అంటే గవర్నమెంటోడు పెడతాడా ? కొబ్బరికాయా అరటిపళ్లు దక్షిణ డబ్బులూ దేవుడుగుతాడు. మామూళ్లు తెచ్చావా లంచం తెచ్చావా అని గవర్నమెంటోడడుగుతాడు. ఇద్దరుకిద్దరూ ఒక్కలాటోళ్లో పేదోళ్లని పీక్కుతినడానికి.

పాక నిండా దోమలు గుయ్యిమని ముసిరి చెవుల్లోనూ ముక్కుల్లోనూ దూరిపోతున్నాయి. చీర చెవులచుట్టూ కప్పుకుని ఒత్తిగిలిపడుతుంది. ఈ సారి బియ్యం ఇచ్చినప్పుడు పిల్లలవెనకాల తనే స్వయంగా వెళ్లి తెచ్చుకోవాలని నిర్ణయించుకుంది.

***రచన : 10-11-1997 --- 13-11-1997***

***ప్రచురణ : ఉపాధ్యాయ ప్రగతి -- 1998***